


చిన్న కుళ్లాయప్ప క్యారికేచర్‌కు అంతర్జాతీయ బహుమతి

ప్రజాశక్తి-నార్పల

అబ్లా ఆర్ట్ ఫౌండేషన్ ఈజిప్ట్ కార్టున్ ఫ్లాట్ ఫాం 'కార్టూన్, ఎల్‌నాస్‌ఎల్‌హెల్వా-2025 అంతర్జాతీయ విజేతలను ఇటీవల ప్రకటించింది. ఇందులో క్యారికేచర్ విభాగంలో వివిధ దేశాల నుంచి పలువురు కార్టునిస్ట్‌లు.. పోటీ పడ్డారు. ఇందులో భారతదేశం నుంచి అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి చెందిన చిన్న కుళ్లాయప్ప (చిన్ని ఆర్ట్స్) సత్తా చాటారు. ఈయన క్యారికేచర్‌కు ద్వితీయ స్థాయి అంతర్జాతీయ అవార్డు లభించింది. చిన్న కుళ్లాయప్ప కేశేపల్లి హైస్కూల్‌లో ఆర్ట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన క్యారికేచర్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డుకు ఎంపికైన క్యారికేచర్

నేడు 'ఆటోడ్రైవర్ల సేవ'లో..

- ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక తోడ్పాటు
- నేడు ఖాతాల్లో డబ్బులు జమ
- అనంతలో భారీ ఆటోల ర్యాలీ





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక తోడ్పాటును అందించే కార్యక్రమాన్ని నేడు ప్రారంభించనుంది. దీనికి 'ఆటో డ్రైవర్ల సేవ'లో అని పేరు పెట్టింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లాలోనూ ప్రజాప్రతినిధులు పథకం ప్రారంభించనున్నారు. ఇప్పటికే అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. గత నెలలో అనంతపురం నగరంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దసరాకు ఆటో డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఇస్తామని చెప్పారు. ఈ మేరకు ఈ పథకాన్ని శనివారం ప్రారంభించనున్నారు.

అనంతపురంలో అత్యధికం

ఆటో డ్రైవర్ల సేవలో పథకం కోసం ఇది వరకే దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 9967 మంది దరఖాస్తు చేసుకుంటే 9275 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. దీనికి మొత్తంగా రూ.13.91 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇక మండలాల వారీగాచూస్తే అత్యధికంగా అనంతపురం రూరల్ మండలంలో ఉన్నారు. రూరల్ పరిధిలో 1434 మందిగా, అనంతపురం అర్బన్‌లో 1137 మంది అర్హులున్నారు. ఇందులో అత్యల్పంగా చూసినప్పుడు బొమ్మనహాళ్ మండలంలో 18 మంది మాత్రమే ఈ పథకం కింద అర్హులున్నారు. ఇక నియోజకవర్గాల వారీగా చూసినప్పుడు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1137 మందికాగా, గుంతకల్లు నియోజకవర్గంలో 1655, రాప్తాడు నియోజకవర్గంలో 1752 మంది, తాడిపత్రిలో 1614 మంది శింగనమల నియోజకవర్గం పరిధిలో1643 మంది అర్హులున్నారు. ఇక కళ్యాణదురర్గం నియోజకవర్గంలో 323 మంది, రాయదుర్గం నియోజకవర్గంలో 343 మంది అర్హులున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 808 మంది ఉన్నారు. మొత్తంగా 9275 మంది అర్హులుండగా రూ.13.91 కోట్ల నిధులు ఈ పథకం కింద జిల్లాలో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు వేయనున్నారు.

'అనంత'లో ర్యాలీ సభ

ఆటో డ్రైవర్ల సేవ పథకం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అనంతపురం నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయం నుంచి సభ జరిగే కెఎస్‌ఆర్ కళాశాల వరకు ఆటో ర్యాలీని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభలో ప్రకటించిన ప్రకారం నేడు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక తోడ్పాటును అందివ్వనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

మార్కెట్ యార్డ్ తనిఖీ



రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డ్‌ను కలెక్టర్ ఓ.ఆనంద్ శుక్రవారం తనిఖీ చేశారు. పండ్ల మార్కెట్ యార్డులో ఈనామ్ కార్యాలయాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న చీనీకాయల క్రయవిక్రయాలపై ఆరా తీశారు. సీజన్‌లో రైతులు, వ్యాపారస్తులతో చర్చలు జరిపి కనీసం 200 టన్నుల చీనీకాయలను ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా తగు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. యార్డులో మిగిలున్న కవర్ షెడ్డు భాగాన్ని పూర్తి చేయాలని, పాత గోదాములను కవర్ షెడ్డులుగా మార్చాలని వ్యాపారస్తులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ మార్కెటింగ్, సెలక్షన్ గ్రేడు సెక్రటరీ పి.రాఘవేంద్ర కుమార్, మార్కెటింగ్ డీఈ పి.రఘునాథ్, సెక్రటరీ గ్రేడు-2 కె.రూపకుమార్ పాల్గొన్నారు.



పాడిరైతుల సంక్షేమాభివృద్ధిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. గ్రామాల్లో పశుపోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వాలు సాయం అందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు యూనిట్ల విభాగంలో లబ్ధిదారులను ఎంపిక చేసి గోకులం నిర్మాణాలు చేపట్టింది. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్న ఆశతో పాడి రైతులు సొంత డబ్బులతో నిర్మాణాలు పూర్తి చేశారు. నిర్మాణాలు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బిల్లులు రాక రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

రాంపురంలో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డు

గోకులం.. బిల్లులు అందని వైనం..!

- సత్యసాయి జిల్లాలో 1335 మంజూరు.. 909 నిర్మాణం పూర్తి
- నెలలు గడుస్తున్నా అందని బిల్లులు
- పాడి రైతులకు తప్పని ఎదురుచూపు



కొడంపల్లి గ్రామంలో పూర్తయిన గోకులం షెడ్డు

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులను పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఉపాధిహామీ పథకం కింద 90 శాతం రాయితీతో రైతులకు గోకులంషెడ్లను మంజూరు చేశారు. అందులో భాగంగా పశు సంవర్ధకశాఖ అధికారులు శ్రీసత్యసాయి జిల్లాకు 1335 గోకులం షెడ్లు మంజూరు చేశారు. పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 184 పంచాయతీలకు 607 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయి. పెనుకొండ నియోజకవర్గంకు 212, మడకశిరకు 213, హిందూపురానికి 182 గోకులం షెడ్లు అధికారులు కేటాయించారు. పెనుకొండ 140, మడకశిరా 213, హిందూపురం 182 షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ మూడు నియోజకవర్గాల్లో 196 షెడ్ల నిర్మాణం పూర్తిచేయాల్సిఉంది.

నెలలు గడుస్తున్నా బిల్లులు అందక రైతులు ఆందోళన

గోకులం షెడ్ల బిల్లులు అందక ఇబ్బంది పడుతు న్నట్లు పలువురు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్ నిర్మాణం పూర్తయ్యి నెలలు గడిచినా బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 909 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.5.25 కోట్లు బిల్లుల బకాయిలున్నాయి. కొంత మంది రైతులకు మాత్రం అరకొర బిల్లులు పడినట్లు సమాచారం. దసరా పండుగకైనా బిల్లులు వస్తాయేమోనని ఎదురుచూసిన పాడి రైతులకు నిరాశే ఎదురైంది. కొందరు రైతులు మంజూరైన గోకులంషెడ్లను వదులుకోలేక అప్పు తెచ్చి షెడ్లను నిర్మించుకున్నారు. నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో వీరంతా లబోదిబోమంటున్నారు. బిల్లుల కోసం పశు వైద్యశాలలు, ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయామని రైతులు వాపోతున్నారు.

మూడు రకాలుగా గోకులం షెడ్లు

ప్రభుత్వం అర్హులైన రైతులకు 90 శాతం రాయితీతో మూడురకాల గోకులం షెడ్లను మంజూరు చేసింది. పాడి పశువుల సంఖ్యను బట్టి గోకులం షెడ్ల నిర్మాణ యూనిట్లను పశువైద్యులు ఎంపిక చేశారు. రెండు పశువులు ఉంటే రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉంటే రూ.1.85 లక్షలు, ఆరు పశువులు ఉంటే రూ.2.30 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రైతువాటా 10 శాతం చెల్లిం చాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది.

షెడ్డు యూనిట్ విలువ..రాయితీ..

2 పశువులు రూ..1.15 లక్షలు యూనిట్ వ్యయం కాగా ప్రభుత్వం వాటా రూ.1,03,500, రైతు వాటా రూ.11,500. 4 పశువులుంటే రూ.1,85,000 యూనిట్ విలువ కాగా రూ.1,66,500 ప్రభుత్వం వాటా, రూ.18,500 రైతు వాటా, 6 కన్నా ఎక్కువుంటే రూ.2,30,000 యూనిట్ విలువ కాగా ప్రభుత్వం వాటా రూ.2,07,000, రైతు వాటా రూ.23,000, 20 గొర్రెలు, మేకలకు యూనిట్ విలువ రూ.1,30,000 కాగా ప్రభుత్వ వాటా రూ.91,000, రైతు వాటా రూ.39,000. 50 గొర్రెలు, మేకలుంటే రూ.2,30,000యూనిట్ విలువ కాగా ఇందులో ప్రభుత్వ వాటా రూ.1,61,000, రైతు వాటా రూ.69,000, 100 కోళ్ల యూనిట్ విలువ రూ.87,000 కాగా ప్రభుత్వ వాటా రూ.60,900, రైతు వాటా రూ.26,100, 200 కోళ్ల యూనిట్ విలువ రూ.1,32,000 కాగా ప్రభుత్వ వాటా రూ.92,400, రైతు వాటా రూ.39,600 గా ప్రభుత్వం నిర్ణయించింది.

అధికారుల వివరణ ఇలా..

పూర్తయిన గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులు ఆన్లైన్లో అప్లోడ్ చేశామని, కొంత మంది రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ డబ్బులు జమైనట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన బిల్లులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని బడ్జెట్ విడుదల అయిన వెంటనే గోకులం షెడ్లు రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని వారు వివరిస్తున్నారు. జిల్లాలో 426 మంది రైతులు షెడ్ల నిర్మాణం పూర్తికావాల్సి ఉందని వారుకూడా త్వరగా షెడ్లను పూర్తి చేసుకుంటే బిల్లులు త్వరగా మంజూరు అవుతాయని ఉపాధి హామీ అధికారులు పేర్కొంటున్నారు.

బిల్లులు తక్షణం మంజూరు చేయాలి

అప్పుచేసి గోకులం షెడ్లు నిర్మాణాలు చేపట్టిన పాడి రైతులకు తక్షణం బిల్లును మంజూరు చేయాలి. నిర్మాణాలు పూర్తి అయి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సబబు కాదు. కేంద్ర ప్రభుత్వం వాటాగా మంజూరు చేయాల్సిన నిధులను తక్షణం విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలి.

హరి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, శ్రీ సత్యసాయి జిల్లా.



మట్టి తరలింపునకు ఉన్న జెసిబిలు, ట్రాక్టర్లు

తవ్వేద్దాం.. తరలిద్దాం..!

లక్షుంపల్లిలో యథేచ్ఛగా మట్టి తరలింపు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

అనుమతులతో పనేముంది.. కొండ కనిపిస్తే చాలు తవ్వేడమే పరిపాటిగా మారింది. పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి సమీపంలోని కొండ నుంచి నిత్యం ఎర్రమట్టిని అనుమతుల్లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఓ గ్రామ స్థాయి నాయకుడు మట్టి తరలించేందుకు తనకు అనుమతులున్నాయంటూ జెసిబి సాయంతో ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. జెసిబిలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి కొండ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగానే మట్టి తరలింపు వ్యవహారం జరుగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నారు. కొండకు సమీపాన బీసీ కాలనీ ఉంది. ఈ కాలనీ మీదుగానే ట్రాక్టర్లలో మట్టిని తీసుకెళ్తున్నారు. నిత్యం అధిక వేగంతో వీటి రాకపోకలు జరుగుతుండడంతో బీసీ కాలనీలో భయాందోళనకు గురవుతున్నారు. అక్రమ సంపాదన కోసం కొండలు, గుట్టలను ఇలా తరలించకుపోవడం వల్ల పర్యావరణ సముతుల్యం ఏర్పడి స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నా తరలింపుదారులు దానిని పట్టించుకోవడం లేదు. మట్టి తరలింపునకు కనీసం పంచాయతీకి కూడా రుసుం చెల్లించలేదు. ఈ విషయంపై తహశీల్దార్ ఉషారాణిని వివరణ కోరగా లక్షుంపల్లి గ్రామంలో ఎర్రమట్టి తవ్వుకోడానికి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.



కొండ తరలింపు ప్రాంతం

పిహెచ్‌సి వైద్యుల సమస్యలు పరిష్కరించండి



ఆందోళన చేస్తున్న పిహెచ్‌సి వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పిహెచ్‌సి వైద్యుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలని వైద్యులు కోరారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. పీజీ వైద్య విద్యను అభ్యసించేందుకు అడ్డుగా ఉన్న జీవో 99ను రద్దు చేసి అన్ని బ్రాంచీల్లో పీజీ ఉన్నత విద్య అభ్యశించాడానికి అవకాశం ఇవ్వాలన్నారు. సీనియార్టీ మేరకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. 2020లో వైద్య వృత్తిలోకి వచ్చిన సివిల్ అసిస్టెంట్ సర్జన్స్‌కు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని విన్నవించారు. పిహెచ్‌సి వైద్యుల ఆందోళనకు సీనియర్ వైద్యులు డాక్టర్ జి.నారాయణస్వామి, శ్రీనివాస బాబు, విష్ణుమూర్తి మద్దతు తెలిపారు.

అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

అనంతపురం జిల్లా పిహెచ్‌సి వైద్యుల అసోషియేషన్‌ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డా॥ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డా॥లోకేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పీహెచ్సీ డాక్టర్ల అసోసియేషన్ వైద్యులు లోకేష్, శివ సాయి, మనోజ్, సురేందర్ రెడ్డి, గణేష్, దిలీప్, పద్మ, సుమన్ కుమార్, సుధాకర్, ప్రవీణ్ కుమార్, శివ శంకర నాయక్, జయ కుమార్ నాయక్, కేశవా నంద, మాధవ్, దేవేంద్ర నాయక్, నంద కిరన్, స్వాతి, ఆసియా, తరున సాయి, ప్రీతి, తేజస్విని, ఉన్నతి, శావని, ఎమీమ భూషణ్, సుస్మిత, లక్ష్మీ చందన, హనీషా తెహరినిషా పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ రావు

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించండి

ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ రావు

ప్రజాశక్తి-అనతపురం కలెక్టరేట్

ఎన్నికల సమయంలో న్యాయవాదులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు డిమాండ్ చేశారు. అనంతపురం బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.9లక్షలను వెంటనే చెల్లించాలన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యభరోసా పథకాన్ని న్యాయవాదులకూ వర్తింపజేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేల ప్రోత్సాహ సాయం అందించాలన్నారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు, ప్రత్యేక సంక్షేమ నిధి, న్యాయ మిత్ర పథకం కింద ప్రతినెలా శిక్షణ భృతి తదితర హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చారని, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఐలు ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా త్వరలో విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు ఈ.ప్రసాద్, నాగరాజు, కమిటీ సభ్యులు నాగభూషన్, శ్రీనివాస్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బెళుగుప్ప ఎంపిపిపై అవిశ్వాసానికి వైసిపి పట్టు



ఆర్డీఓ వసంతబాబుకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి ఎంపిటిసిలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఉరవకొండ నియోజకవర్గం బెళుగుప్ప మండల ఎంపిపి పెద్దన్నపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వైసిపి ఎంపిటిసిలు ఆర్‌డిఒ వసంతబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైసిపి ఎంపిటిసిలు పుష్పావతి, ప్రసాద్, వరలక్ష్మి, ఈరబొమ్మన్న, అంజినమ్మ, సురేఖ, నాగరత్నమ్మ, ప్రభావతి, రేఖమ్మ కలిసి ఆర్‌డిఒ వసంతబాబును కలిశారు. బెళుగుప్ప మండలంలో ఎంపిపి పెద్దన్న ఏకపక్షంగా వ్యవహరిస్తూ అభివృద్ధి పనులకు సహకరించకుండా సభ్యులను విబేధిస్తున్నారన్నారు. కనీస గౌరవం కూడా ఇవ్వడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున మెజార్టీ సభ్యులం ఎంపిపి తీరును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి హయాంలో బెళుగుప్ప మండలం దుద్దెకుంట నుంచి ఎన్నికైన ఎంపిటిసి పెద్దన్న మండల ఎంపిపిగా ఎన్నికయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడిపిలో చేరాడు. ఈనేపథ్యంలో మండలంలో 12 మంది ఎంపిటిసిలు ఉండగా 8 మంది వరకూ ఎంపిపి తీరును తప్పుపడుతూ అవిశ్వాసానికి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఈరన్న, త్రిలోక్‌రెడ్డి, మచ్చ, శివలింగ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

8న వాహనాల వేలం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో నిరుపయోగంగా ఉన్న వాహనాలకు ఈ నెల 8వ తేదీన వేలం వేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ శాఖ అధికారి (డిఆర్‌ఒ) ఏ.మలోల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వాహనాల వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు వేలం ధరతో పాటు రూ.18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనాలనుకునే వారు తమ గుర్తింపు కార్డులు ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, ఓటర్ కార్డులతో హాజరు కావాలన్నారు. రుసుం రూ.10 వేలు డిడి డిఆర్‌ఓ అనంతపురం పేరుతో తప్పకుండా చెల్లించాలన్నారు. వేలం పాట పాడి స్క్రాప్ వాహనాలు దక్కించుకోని వారికి వారు డిడి రూపంలో చెల్లించిన రుసుం వెనక్కు ఇస్తామన్నారు.

301 చెరువులకు నీరందించేలా చర్యలు : కలెక్టర్



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో 301 చెరువులకు నీరందించేందుకు అవసరమైన కార్యచరణ ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో హెచ్‌ఎల్‌సి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 301 చెరువులను నీటితో నింపాల్సుందన్నారు. హెచ్‌ఎల్‌సి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పరిధిలో ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఏమైనా భూసేకరణలు అవసరం ఉందా అన్న విషయాలను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, హెచ్‌ఎల్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, హెచ్‌ఎల్‌సి ఎస్‌ఈ సుధాకర్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ రాజా స్వరూప్ కుమార్, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ విశ్వనాథరెడ్డి, డిఈ రాము పాల్గొన్నారు.

అమృత్ పనుల్లో వేగం పెరగాలి

నగర పాలక సంస్థ, మున్సిపాల్టీలో అమృత్ పథకం పనులు వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అమృత్ పథకం పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణం, తదితర అంశాలపై పబ్లిక్ హెల్త్, నగర పాలక సంస్థ, టిడ్కో అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమృత్ 1.0 కింద రూ.15.35 కోట్లతో చేపట్టిన అనంతపురం నీటి సరఫరా అభివృద్ధి పనులు పూర్తివుతున్న నేపథ్యంలో వచ్చే 30 రోజులు సరైన విధంగా ట్రయల్ రన్ పూర్తిచేయాలని పబ్లిక్ హెల్త్ ఈఈని ఆదేశించారు. రూ.10.98 కోట్లతో గుంతకల్లులో చేపట్టిన అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. టిడ్కో గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని, పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, నగర పాలక సంస్థ ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ షాకిర్ పాల్గొన్నారు.

ధర తగ్గనున్న వ్యవసాయ పరికరాలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ


వ్యవసాయ పరికరాలను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ప్రవేశపెట్టిన 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'తో వ్యవసాయ పరికరాల ధరలు మరింత తగ్గాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఎపి ఆగ్రోస్ కార్యాలయ ప్రాంగణంలో ఎపి ఆగ్రోస్ మేనేజర్ ఓబుళపతి అధ్యక్షతన శుక్రవారం వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ 12 నుంచి 5శాతానికి తగ్గించారన్నారు. కావున రైతులు జీఎస్టీ తగ్గింపును వినియోగించుకోవాలని కోరారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ (డ్రిప్), (స్ప్రింక్లర్లపై తగ్గింపు జీఎస్టీ తక్షణమే వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎస్ రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు, రెడ్డిపల్లి కెవికె ప్రిన్సిపాల్ సైంటిస్ట్ మల్లేశ్వరి, ఆత్మా ప్రాజెక్ట్ పద్మజ, ఉద్యానశాఖ సహాయ సంచాలకులు దేవానంద్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీం, సహాయ వ్యవసాయ సంచాలకులు జెఎం అల్తాఫ్ అలీఖాన్, జడ్పీఎన్ఎఫ్ లక్ష్మణనాయక్, మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకట్‌కుమార్, టెక్నికల్ వ్యవసాయ అధికారులు రాఖేష్‌నాయక్, వంశీకృష్ణ, గార్లదిన్నె మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, వ్యవసాయ విస్తారణ అధికారులు బి.మురళీకృష్ణ, మల్లికార్జున, అలేఖ్య, భాగ్యశ్రీ, రైతు సేవాకేంద్రం, అగ్రోస్ సిబ్బంది శర్మ, లక్ష్మీనారాయణ, ఖాజా, రైతులు, వ్యవసాయ పనిముట్ల డీలర్ల సంఘం అధ్యక్షులు గోపాల్, ఆత్మకూరు జిలాన్ స్టీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పుట్లూరు విద్యార్థులు

ప్రజాశక్తి-పుట్లూరు

అనంతపురంలో జరిగిన బాక్సింగ్ క్రీడలో పుట్లూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అంత్యత ప్రతిభ కనబరిచి రాష్ట్రపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునయాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన ప్రత్యూష, భార్గవి, అంజలి, బిందు, వైష్ణవ్‌కుమార్‌రెడ్డి, మణికంఠ, భరత్‌కుమార్, విజయ్‌కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, బిసిహెచ్‌డబ్ల్యు శివారెడ్డి, పూర్వ విద్యార్థులు అభినందించారు.

నూతన ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని కొర్రపాడు శాస్త్రీయ శిక్షణ నిలయంలో ఇటీవల నూతనంగా ఎంపికైన ఎస్‌జిటిలకు ఇండక్షన్ ట్రైనింగ్‌ను ఎపిసి శైలజా, డిప్యూటీ డిఇఒ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. 2025 మెగా డీఎస్సీలో అనంతపురం జిల్లాలో ఎంపికైన 148 మంది ఎస్‌జిటి ఉపాధ్యాయుల కోసం ఇండక్షన్ ట్రైనింగ్ శుక్రవారం నుంచి ఈనెల 10వతేదీ వరకూ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ఆధునిక బోధన పద్ధతులు, తరగతి గది నిర్వహణ, విద్యార్థుల మార్గదర్శకత, ఎఫ్ఎల్ఎన్, నూతన విద్యా విధానాలపై అవగాహన కల్పించనున్నారు. కోర్సు డైరెక్టర్లుగా బుక్కరాయసముద్రం ఎంఇఒ లింగనాయక్, కంబదూరు ఎంఇఒ విజయకుమారి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు, ఎఎంఒ వేణుగోపాల్, సీనియర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

రహదారి గుంతలమయం..!

ప్రమాదకరంగా పామిడి- కల్లూరు రహదారి-ప్రమాదాలతో గాయాలపాలవుతున్న జనం

ప్రజాశక్తి-పామిడి

పామిడి మండల కేంద్రం నుంచి పెన్నానది మీదుగా కల్లూరు, గార్లదిన్నె, జిల్లాకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వాన్నంగా మారింది. దీంతో వాహనచోదకులు, పంటపొలాలకు వెళ్లే రైతులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పెన్నానదిలో ఉన్న ప్రధాన రహదారి సత్యసాయి వాటర్ రూముకు దగ్గరలో తాగునీటి పైపులైన్ పగిలి నీరంతా రోడ్డుపైకి చేరి నీరు నిల్వ ఉంటోంది. దీంతో గుంత ఎంత లోతు ఉందో అర్థంకాక వాహనచోదకులు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పామిడి నుంచి చుట్టుపక్కల మండలాలు, గ్రామాలకు ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఆర్టీసీ, కళాశాల బస్సులు, పాల డెయిరీ వ్యాన్లు, ఆటోలు, టువీలర్‌దారులతో రద్దీగా ఉంటోంది. అలాంటి సమయంలో ఈ గుంతల్లో వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. ప్రధానం రహదారి విస్తరణకు నోచుకోకపోవడమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గుంతల మయమైన రోడ్డును మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలమయమైన పామిడి-కల్లూరు రహదారి

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..



మండల కేంద్రం నుంచి పెన్నానది మీదుగా కల్లూరు, గార్లదిన్నె వైపు వెళ్లే రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పటించుకునే వారే లేరు. ఇదే దారిలోనే అటు నాయకులు, ఇటు అధికారులు నిత్యం తిరుగుతుంటారు. ఈ విషయం తెలిసిన వారు తెలియనట్లు వెళ్తుండటం బాధాకరం. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి రహదారికి చేయించాలి.

మల్లేష్, సిపిఎం మండల కార్యదర్శి.

సత్యసాయి పైపులైన్‌ను బాగు చేయాలి



పామిడి నుంచి కల్లూరు మీదుగా అనంతపురం వెళ్లే రహదారిలో సత్యసాయి పైపులైన్‌ను బాగు చేసినా చాలా వరకూ గుంతలను నివారించవచ్చు. సత్యసాయి వాటర్ రూము వద్ద గుంతల్లో నీరు ఉండటం వల్ల ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటు రోడ్డు, ఇటు తాగునీటి పైపులైన్‌ను సరిచేయాలి

వడ్డే లక్ష్మణ్ కుమార్, రైతుసంఘం మండల అధ్యక్షులు.

రోడ్డును వెడల్పు చేయాలి



కల్లూరు రహదారిని వెడల్పు చేయాలి. ముఖ్యంగా సత్యసాయి వాటర్ రూమ్‌కి దగ్గరలో గుంతలమయమైన రోడ్డుతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తద్వారా నీరు గుంతల్లో చేరుతుండటంతో వాహనాలు వెళ్లినప్పుడు గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. కావున రహదారిని వెడల్పు చేయడంతోపాటు సత్యసాయి పైపులైన్ మరమ్మతులు చేయాలి

వై.సాయికుమార్, రైతు సంఘం కార్యదర్శి.

బొందలవాడకు 'స్వచ్ఛ' అవార్డు

ప్రజాశక్తి-నార్పల


బొందలవాడ చెత్త సంపద కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2025లో మండలంలోని బొందలవాడ పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు దక్కింది. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆదర్శవంతంగా నిర్వహించడంతోపాటు రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇళ్ల నుంచి సేకరిస్తూ ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన పంచాయతీగా అభివృద్ధి చేసినందుకు ఈ అవార్డు దక్కింది. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలో కలెక్టర్‌తో పంచాయతీ కార్యదర్శి అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సర్పంచు ఆలం శిరీషా, ఉపసర్పంచు ఆలం వెంకటనరసనాయుడు ప్రోత్సాహం, ఎంపిడిఒ మమతాదేవి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, డిపిఆర్‌సి సలహా, సూచనలు, గ్రామస్తులు, పారిశుధ్య కార్మికుల సహకారంతోనే ఈ అవార్డు వచ్చిందన్నారు. అవార్డు రావడం మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, శ్రామికులు, సిఐటియు నాయకులు

తాడిపత్రి : కూటమి నాయకులు ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి హనుమంతురెడ్డి డిమాండ్ చేశారు. తాడిపత్రి పట్టణం సిఐటియు కార్యాలయంలో ఎపి బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భవన, ఇతర నిర్మాణ కార్మికులకు తాడిపత్రి లేబర్ అధికారి ప్రతాప్‌నాయుడు కార్మికులకు లేబర్ ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి కార్మిక కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. వీటితోపాటు అనే సమ్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు ఉమాగౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

రాయదుర్గం : విప్ కాలవ శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా సేవాభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ముందుగా విప్ నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత నోటు పుస్తకాలు, పండ్లు అందజేశారు.

ఎస్పీని కలిసిన టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం : ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి శుక్రవారం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడాలని కోరారు.

రీసర్వేకు సహకరించాలి

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో చేపట్టిన రీ సర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ మునివేలు కోరారు. ఈమేరకు శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలందరూ సహకరిస్తే సకాలంలో సర్వే పూర్తి చేసి మీకు హద్దులు, వాటి పూర్తిగా వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రవితేజ, వీఆర్వో నరసింహులు, రెవెన్యూ సిబ్బంది, విఆర్ఎలు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక స్వాధీనం

బొమ్మనహాల్ : మండలంలోని కురువల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు డంపు చేసుకున్న 30 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ మునివేలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురువల్లి సమీపంలో కొందరు ఇసుకను డంపు చేసుకున్నట్లు అందించిన సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నబిరసూల్, రైతులు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యమే గాంధీజీ ఆశయం

కళ్యాణదుర్గంటౌన్ : గ్రామస్వరాజ్యమే గాంధీజీ ఆశయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మాహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రజావేదికలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదలకు అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ రమణిబాబా వర్ధంతిని పురస్కరించుకుని వారి శిష్యులు సరళ, మోహన్‌రెడ్డి, శ్రీవాణి, విజయ భాస్కర్‌రెడ్డి, గురు ప్రణీత్‌రెడ్డి సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఓబుళపతి, భవాని, నబిరసూల్, చంద్రశేఖర్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా యల్లమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-శింగనమల


అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో వెలసిన ఆగులూరప్ప, రేణుకా యల్లమ్మ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దాదాపు పది రోజులపాటు గ్రామపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతోపాటు అన్నదానం చేశారు. చివరిరోజు బ్రహ్మంగారి జీవిత చరిత్ర పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. నాటకాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం

యాడికి : విషజ్వరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాయలచెరువు ఉప్పర వీధిలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా, వంటి విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి జ్వరాలతో వచ్చే ప్రజలకు రక్త పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షబ్బీర్ అహ్మద్, మేల్ హెల్త్ అసిస్టెంట్ మొయినుద్దీన్, ఆశా కార్యకర్త ఆశాబీ పాల్గొన్నారు.

వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రమేష్‌నాయుడు

యాడికి : మండల కేంద్రానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు బొంబాయి రమేష్‌నాయుడు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చినందుకు వైసిపి అధినేత జగన్, ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లో చేరిన డెమో నాగరాజు

అనంతపురం : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాస్ మీడియా విభాగ అధికారిగా పిఒడిటిటి విభాగంలో హెచ్ఇఒగా పని చేస్తున్న ఈడిగ నాగరాజు ఉద్యోగోన్నతి పొంది విధుల్లో చేరారు. ఈమేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవిని కలిసి రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా నాగరాజును కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.

పోలీసుల తనిఖీలు

అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆటోల ఓవర్ లోడింగ్, ట్రిబుల్ రైడింగ్, డ్రంకన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, తదితరాలపై చర్యలు తీసుకున్నారు. తర్వాత రోడ్డు ఉల్లంఘనదారులకు జరిమానా విధింపుతోపాటు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించి సేఫ్టీగా ప్రయాణం చేయాలంటూ చైతన్యం చేశారు. ప్రజల భద్రత, భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్, నేరాలు జరగకుండా కట్టడి చేస్తూ నిఘా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల సీఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో'

అనంతపురం : ఈగల్ ఐజిపి ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు ఎస్పీ పి.జగదీష్ సూచనలతో అనంతపురం సమీపంలోని ఎ.నారాయణపురం పంచాయతీలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ సెల్ ఎస్ఐ హనుమంతు ఈగల్ విభాగం కార్యకలాపాలు, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఫ్రీకాల్ నంబర్ 1972కు సమాచారంపై అవగాహన కల్పించారు.

'అనంత'లో జ్యువెల్లరీ దుకాణం ప్రారంభం

శింగనమల : అనంతపురంలోని శ్రీనగర్ కాలనీ, సవీరా ఆసుపత్రి సమీపంలో లక్ష్మీరంగనాథ స్వామిజ్యువెలర్స్ నూతన దుకాణాన్ని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించారు. ఇందులో భాగంగా దుకాణంలోని జ్యువెలరీస్‌ను పరిశీలించారు. విభిన్న డిజైన్లలో బంగారం, వెండి, వజ్రాభరణాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్టీ'పై అవగాహన

పుట్లూరు : 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఎఒ కాత్యాయని ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయానికి సంబంధించిన గొర్రు, గుంటక, మడకలు, రొటేవేటర్లు, ఫిల్లర్లు, ట్రాక్టర్లు, ట్రాలీలు, వ్యవసాయ యంత్రాలపై తగ్గిన జీఎస్టీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రవితేజ పాల్గొన్నారు.


యాడికి : సూపర్ జీఎస్టీ-సూపర్ తగ్గింపుపై శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద అధికారులు మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. అంతకుముందు సమావేశ భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేల్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సోనియా తార, డిప్యూటీ ఎంపిడిఒ శశికళ, నాయకులు దడియాల ఆది, తాంద్ర విక్రమ్, ఆదిత్యపవన్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పామిడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జిల్లాలో పేదల పెన్నిధిగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని కొండాపురం రోడ్డులో ఉన్న దివ్యాంగుల కమిటీ హాల్‌లో ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు వడ్ల సర్వేష్ అధ్యక్షతన సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వతేదీన సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోజు ముందుగా అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు. కావున ఆయా కార్యక్రమాలకు దివ్యాంగులతోపాటు కుల, ప్రజాసంఘాల నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల అధ్యక్షులు కేశవాచారి, ఉపాధ్యక్షులు నీలూరు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి శివన్న, నాగభూషణం, నరసింహులు, రహంతుల్లా, వడ్డే లక్ష్మయ్య, మల్లికార్జున, కేశవ, ఓబుళపతి, సుధాకర్, హనుమాన్ బాబు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పామిడి

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ తేజోష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజాప్రతినిధులు పంచాయతీల్లో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా సొరకాయలపేట సర్పంచు మూలింటి నాగేశ్వర్‌రెడ్డి, రామరాజుపల్లి సర్పంచు ముత్యాలరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో చేసిన పనులకు బిల్లులు పెట్టాలని అధికారులను కోరారు. వైస్ ఎంపిపి కాయల మహేష్ మాట్లాడుతూ అనుంపల్లి గ్రామంలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంద పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా అగ్రికల్చర్-2024కు సంబంధించి రైతులు బీమా కట్టారని, పరిహారం మాత్రం ఇవ్వలేదన్నారు. కావున వెంటనే ఇవ్వాలని వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్‌ని కోరారు. ఇందుకు స్పందించిన ఎఒ విషయాన్ని వ్యవసాయ శాఖ జేడీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన వచ్చేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, మండల స్థాయి పలుశాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు గుర్తించేందుకు గ్రామసభలు

పుట్లూరు : మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు, చేపట్టాల్సిన పనుల గుర్తింపు, తదితర విషయాలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమాల్లో ఎపిఒ తులసీప్రసాద్, ఇసి, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : పంచాయతీ అభివృద్ధి మన అందరి బాధ్యత అని డిఎల్‌డిఒ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని సంతే కొండాపురం గ్రామ పంచాయతీలో సర్పంచు మల్లెల వనితా మల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనుల గుర్తింపు, ప్రాధాన్యత క్రమం, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శి అనిత, సింగిల్‌విండో ప్రెసిడెంట్ ఓబులేసు, సచివాలయ ఉద్యోగులు ప్రియాంక, శ్రీదేవి, హనుమంతు, ఆరోగ్య సిబ్బంది సల్మా, మల్లేశ్వరి, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'మా గ్రామానికి బస్సు నడపండి'..

గుండిగానిపల్లివాసుల వేడుకోలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

'మా గ్రామానికి బస్సు నడపండి సారూ..' అంటూ మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామస్తులు వేడుకుంటున్నారు. దాదాపు ఎనిమిది ఏళ్లుగా గ్రామానికి బస్సు రావడం లేదని చెబుతున్నారు. గతంలో రాయదుర్గం నుంచి పొబ్బర్లపల్లి బస్సు సర్వీసును గుండిగానిపల్లి నుంచి పోలేపల్లి నైట్‌హాల్ట్ బస్సు నడిపేవారు. అయితే బస్సు రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు, తెల్లవారుజామున ప్రయాణించాలంటే గగనంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇక అత్యవసర సమయంలో అయితే మరింత వర్ణణాతీతం అని అంటున్నారు. కావున దాదాపు 2000 జనాభా కలిగిన తమ గ్రామానికి బస్సు నడపాలని ఎమ్మెల్యే సురేంద్రబాబుకు సోషల్ మీడియా ద్వారా గుడిగానిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

వైసిపి నాయకుని మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

పామిడి : అనారోగ్యంతో మృతిచెందిన పామిడి వైసిపి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్‌రెడ్డి వారి బావ మోహన్‌రెడ్డికి పలువురు వైసిపి నాయకులు నివాళులర్పించారు. ఇందులో భాగంగా అనంతపురంలోని సవీరా ఆసుపత్రికి వెళ్లి మోహన్‌రెడ్డికి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు కొత్తపల్లి శంకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మీసాల రామచంద్ర, పామిడి సూరి, తుల్లాభాయ్, ధనుంజయరెడ్డి, విభూది కాశీం, వెంకట్ గుప్తా, హరిమారాజు, బోయ శీన, తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రాముడు పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కల్లూరుకు బయలుదేరాడు. అయితే కొత్తపేట గ్రామ శివారులో రోడ్డుపై కుక్కను తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన రాముడును గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళకు పాముకాటు

గుత్తి : మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో పాముకాటు వేయడంతో ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. పోలీసులు, ఆసుపత్రి వర్గాలు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామానికి చెందిన ఖాజాబీ గురువారం రాత్రి పని నిమిత్తం ఇంటి బయటకు వెళ్లింది. అయితే చీకటి ఉండటంతో అప్పటికే అక్కడ ఉన్న పామును ఆమె గమనించ కుండా పోవడంతో అది కాలికి కాటు వేసింది. అయితే నొప్పి కావడంతో వెంటనే ఆమె విషయం కుటుంబ సభ్యులకు తెలిపింది. లైట్ వేసి చూడగా పాము వెళ్తూ కనిపించింది. అస్వస్థతకు గురైన ఖాజాబీని వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అత్యవసర చికిత్సలు అందించి 24 గంటల పాటు తమ పర్యవేక్షణలో ఉండాలని సూచించారు.

వెల్లుట్లలో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో కలముదొడ్డి కోసం రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దీంతో ఒక కుటుంబానికి చెందిన భార్యాభర్తలకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయాలైన వారిలో ఎలంకూరి నాగేశ్వరయ్య, భార్య అచ్చమ్మను తన చిన్నాయన కొడుకులే కొట్టారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.